సాక్షి
కామారెడ్డి
బుధవారం। 1। ఫిబ్రవరి। 2023



అభివృద్ధికి రూ. 40 కోట్లు..
కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు.
- 8లో ▸



ముగిసిన ఎస్‌పీఎల్
నిజామాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ముగిసింది.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.8 /17.2

వాతావరణం
పొగమంచు కురుస్తుంది. ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కాస్త తగ్గవచ్చు.

నిర్మలమ్మ కరుణించేనా!?

- రైల్వే లైన్ డబ్లింగ్ కాక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- కలగానే మిగిలిన బోధన్–బాన్సువాడ–బీదర్ రైల్వేలైన్
- దశాబ్దాలు గడుస్తున్నా తీరని 'గేటు' కష్టాలు
- కేంద్ర బడ్జెట్‌పై జిల్లావాసుల్లో ఆశలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం చివరిసారి ప్రవేశపెట్టబోయే పూర్తిస్థాయి బడ్జెట్‌పై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఈసారి జిల్లా మీదుగా వెళ్లే రైల్వే ప్రాజెక్టులపై దృష్టి సారిస్తారని ఆశిస్తున్నారు. ప్రజల ఆశలను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ నెరవేరుస్తారా, నీరు గారుస్తారా అన్న అంశంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.





కామారెడ్డి పట్టణంలో రైల్వేగేటు వద్ద వంతెన లేకపోవడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు (ఫైల్)

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా కేంద్రాల మీదుగా వివిధ రాష్ట్రాలకు రోజూ పదుల సంఖ్యలో రైళ్లు నడుస్తున్నాయి. కొన్నేళ్లుగా గూడ్స్ రైళ్ల సంఖ్య కూడా పెరిగింది. దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన సికింద్రాబాద్ –కామారెడ్డి –నిజామాబాద్ –ముథ్కేడ్ రూట్‌లో రోజూ 60 వరకు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుగుతున్నాయి. రాష్ట్ర రాజధాని నుంచి దేశ వాణిజ్య రాజధాని అయిన ముంబయికి ఈ మార్గం దగ్గరగా ఉంటుంది. ఈ మార్గంలో రోజూ దేవగిరి ఎక్స్‌ప్రెస్ ముంబయికి వెళ్తోంది. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో బాసర సరస్వతి మాత ఆలయం, నాందేడ్ గురుద్వారా, షిరిడీ సాయిబాబా లాంటి ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. దీంతో రైళ్లలో రద్దీ ఎక్కువగానే ఉంటోంది. అందుకు తగ్గట్టుగానే రైళ్ల సంఖ్యను పెంచారు. సికింద్రాబాద్ – ముథ్కేడ్ మార్గంలో గూడ్స్ రైళ్లు కూడా పెరిగాయి. అయితే సింగిల్ లైన్ ఉండడంతో ఒక రైలు వస్తుందంటే ఇంకో రైలును సమీప స్టేషన్‌లో నిలపాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణికుల సమయం వృథా అవుతోంది. డబ్లింగ్ అయితే ఇబ్బందులు తొలగుతాయి. సికింద్రాబాద్ నుంచి ముథ్కేడ్ వరకు 249 కి.మీ. దూరం ఉంది. డబ్లింగ్ చేయాలని ప్రజలు ఏళ్లుగా కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈసారి బడ్జెట్‌లోనైనా డబ్లింగ్‌కు నిధులిస్తారని ఆశిస్తున్నారు.

'వందేభారత్' వచ్చేనా..

కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన వేలాది మంది ముంబయిలో జీవిస్తున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి దేశ వాణిజ్య రాజధాని ముంబయి మధ్య దేవగిరి ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. నిత్యం వందలాది మంది ఈ ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రయాణిస్తుంటారు. ఈ మార్గంలో వందే భారత్ రైలు నడిపితే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుంది. ప్రభుత్వం వందేభారత్ రైలు మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

'బీబీబీ'కి మోక్షం లభించేనా?

వెనుకబడిన ప్రాంతమైన బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు రైల్వే సదుపాయం కల్పించేందుకుగాను బోధన్ నుంచి బాన్సువాడ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ వరకు రైల్వేలైన్ వేయాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. బాన్సువాడ –బీదర్ మధ్య దూరం 140 కిలోమీటర్లు. బాన్సువాడ – బోధన్ – బీదర్ రైల్వే లైన్ మంజూరుకు కృషి చేస్తామని ఎన్నికల సమయంలో నేతలు హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చేందుకు ఏ ఒక్కరూ గట్టిగా ప్రయత్నించిన దాఖలాలు లేవు. దీంతో ఈ రైల్వేలైను కలగానే మిగిలిపోతోంది. ఈ లైన్ కోసం గతంలో సర్వే కూడా చేశారు. ఆ తర్వాత మర్చిపోయారు. అలాగే 44వ నంబర్ జాతీయ రహదారి వెంట డిచ్‌పల్లి నుంచి ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్ వరకు అక్కడి నుంచి నాగ్‌పూర్‌కు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ లైన్ ఏర్పాటైతే దేశ రాజధాని ఢిల్లీకి దూరం తగ్గుతుంది. ఈ లైను ఏర్పాటు కోసం ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉన్నా ఇప్పటికీ ప్రతిపాదనల దశ దాటలేదు. ఆయా మార్గాల్లో కొత్త రైలు మార్గాలు వేయాలని కోరుతున్నారు.

అలాగే కరీంనగర్ నుంచి పిట్లం వరకు కేకేవై(కరీంనగర్ – కామారెడ్డి – ఎల్లారెడ్డి) జాతీయ రహదారి నిర్మించాల్సి ఉంది. ఈ మార్గానికి బడ్జెట్‌లో నిధులు ఇస్తారని ఆశిస్తున్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జీలు మంజూరయ్యేనా?

జాతీయ రహదారిపై రైల్వే క్రాసింగ్‌ల వద్ద రైల్వే బ్రిడ్జీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి పట్టణానికి సమీపంలోని నర్సన్నపల్లి వద్ద బ్రిడ్జి లేకపోవడంతో కామారెడ్డి పట్టణం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. అలాగే కామారెడ్డి పట్టణాన్ని రైల్వే లైను రెండుగా చీలుస్తుంది. పట్టణంలో ఒక్కటే బ్రిడ్జి ఉండడం, అది కూడా ఇరుకుగా మారడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మరో రెండు చోట్ల బ్రిడ్జీలు నిర్మించాలన్న డిమాండ్ ఉంది. అశోక్‌నగర్ రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలకు వెళ్లేందుకు ఈ మార్గమే అనువుగా ఉంటుంది. రోజూ 60కిపైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ రైల్వే గేటు పడుతోంది. అవసరమైన చోట రైల్వే ఓవర్ బ్రిడ్జీలు నిర్మిస్తే వాహనదారులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

న్యూస్‌రీల్

'వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయొద్దు'



కామారెడ్డి టౌన్: ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, లేబర్‌రూంలను పరిశీలించారు. డీసీహెచ్‌ఎస్ చాంబర్‌లో వైద్యులతో సమీక్షించారు. మాతా, శిశుమరణాలు లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. ఆపరేషన్ థియేటర్‌ను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ఆర్‌ఎంవో శ్రీనివాస్, వైద్యులు పాల్గొన్నారు.

మాతాశిశు ఆస్పత్రి సందర్శన



బాన్సువాడ టౌన్: బాన్సువాడలోని మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిని మంగళవారం రాష్ట్ర పర్యవేక్షకురాలు పూజ మరాఠే సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. తల్లి పాల ప్రాముఖ్యతను బాలింతలకు వివరించారు. బిడ్డకు పాలు పట్టే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బేబీ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇన్షియేటివ్, ఐఎంఎస్ యాక్ట్–92 విభాగంలో అక్రెడిటేషన్ కోసం మాతాశిశు సంరక్షణ ఆస్పత్రులను సందర్శిస్తున్నామన్నారు. ఈ పోటీలో పాల్గొంటున్న మొట్టమొదటి ఆస్పత్రి బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి అని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. తప్పకుండా గుర్తింపు వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, వైద్యులు పి.సుధ, సంతోష్, శిరీష, నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ శాంతకుమారి, ఆరోగ్య సిబ్బంది జ్యోతి, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

10న ప్లేస్‌మెంట్ డ్రైవ్

కామారెడ్డి అర్బన్: బహుళజాతి కంపెనీ అయిన జెన్‌పాక్ట్‌లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 10న ఉదయం 10 గంటలకు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 2023 సంవత్సరాల్లో బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఈ, బీటెక్ కోర్సులు పూర్తి చేసినవారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94403 56276, 91823 04067 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

6 నుంచి డీఈఈ సెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కామారెడ్డి అర్బన్: డీఈఎల్‌ఈడీ, డీపీఎస్‌ఈ అడ్మిషన్ల కోసం ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు మూడో విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని నిజామాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఈ సెట్–2022లో పాసై తొలి, మలి విడతల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకానివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సీటు పొందిన వారు 14 నుంచి 17 వరకు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

నిజామాబాద్ కలెక్టర్‌గా రాజీవ్‌గాంధీ హనుమంతు



రాజీవ్‌గాంధీ హనుమంతు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి బదిలీ అయ్యారు. 2019 డిసెంబర్ 24 నుంచి నిజామాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను వికారాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో రాజీవ్ గాంధీ హనుమంతును నిజామాబాద్ కలెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం ఆయన హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. రెండు రోజుల్లో నిజామాబాద్‌లో బాధ్యతలు స్వీకరిస్తానని రాజీవ్ గాంధీ హనుమంతు 'సాక్షి'తో తెలిపారు.

'రైతుల అభ్యున్నతికి కృషి'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సదాశివనగర్: పేద రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో భూంపల్లి, మోడిగాం గ్రామాల్లోని రైతులు ఏర్పాటు చేసుకున్న ఫిష్ పాండ్‌లను ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేపల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చన్నారు. ప్రతి గ్రామంలో పది మంది రైతులను గుర్తించి చేపల పెంపకంపై దృష్టి సారించేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు లలితాబాయి, తిరుమల, ఎంపీటీసీ సుజాత, మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు భూంరెడ్డి, డీపీఎంలు రమేష్‌బాబు, రవీందర్‌రావు, ఏపీఎం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాచాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్

'పాడితో ఆర్థికాభివృద్ధి'

భిక్కనూరు: పాడిని అభివృద్ధి చేసుకుంటే రైతులు ఆర్థికంగా ఎదగవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం కాచాపూర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకంపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం పశుసంపదను కాపాడేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. కాచాపూర్‌లో 530 పశువులకు పరీక్షలు చేసి అవసరమైన వైద్యం అందించారు. కార్యక్రమంలో పీవీ నర్సింహారావ్ పశు వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి, వెటర్నరీ డైరెక్టర్ భరత్, పశు వైద్యాధికారి దేవేందర్, ఎంపీపీ గాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, సర్పంచ్ సులోచన, మాజీ ఎంపీపీ సుదర్శన్, పాల కేంద్రం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన మహిళా సంఘాలు



బీబీపేటలో ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తూ..



దోమకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

దోమకొండ: వడ్డీ లేని రుణాలకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు కదం తొక్కారు. గురువారం దోమకొండ, బీబీపేటలలో భారీ ర్యాలీలు తీశారు. దోమకొండలో శివరామ మందిర్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. బీబీపేటలో వారాంతపు సంత నుంచి ప్రారంభమైన ర్యాలీ పలు వీధుల మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు సాగింది. ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాలలో బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా వడ్డీలేని రుణాలకు సంబంధించిన నిధులను విడుదల చేయడం లేదన్నారు. మహిళా సంఘాలకు ఒక్క కామారెడ్డి నియోజకవర్గంలోనే రూ. 47.50 కోట్ల బకాయిలు రావాల్సి ఉందన్నారు. గతంలో డ్వాక్రా సంఘం సభ్యురాలు మరణిస్తే తక్షణ సహాయంగా రూ. 5 వేలు, అనంతరం రూ. 30 వేలు అందించేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సహాయాన్ని అందించడం లేదన్నారు. అభయహస్తం, స్త్రీనిధి, వడ్డీలేని రుణాలకు సంబంధించిన బకాయిలను విడుదల చేసేంతవరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే తాను నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కార్యక్రమాలలో బీజేపీ దోమకొండ మండల అధ్యక్షుడు చింతల రాజేష్, దోమకొండ, బీబీపేట మండలాల నాయకులు కుంట లక్ష్మారెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, భూపాల్ లక్ష్మణ్, కల్పన, రంజిత్‌గౌడ్, సంతోష్‌గౌడ్, పోసు శివ, శ్రీనివాస్, నక్క రాజు, దేవరాజుగౌడ్, కుమార్ పాల్గొన్నారు.

తప్పుల తడక..!

- ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లలో గందరగోళం
- 'సాక్షి' కథనాలతో స్పందించిన విద్యాశాఖ
- వెబ్‌సైట్‌లో సీనియారిటీ వివరాల ప్రదర్శన
- అనర్హులకు ప్రాధాన్యత ఇచ్చారంటున్న సీనియర్లు
- నిబంధనలకు విరుద్ధంగా మరో నలుగురి బదిలీ!
- నేటితో ముగియనున్న బదిలీల ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. నాలుగు రోజుల ఆలస్యంగా సీనియారిటీ జాబితాను ప్రదర్శించిన విద్యాశాఖ.. అనర్హులకు ప్రాధాన్యత ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా మరో నలుగురిని బదిలీ చేశారని తెలియడంతో సీనియర్లలో ఆందోళన నెలకొంది.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

కామారెడ్డి టౌన్: విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గతనెల 27నే ఉపాధ్యాయ పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ, ఖాళీల జాబితా విడుదల చేయాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియలో జాప్యం జరిగింది. దీనిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలతో అధికారులు స్పందించి మంగళవారం జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు. అయితే మెరిట్ కం రోస్టర్ ప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగా జాబితా రూపొందించారన్న విమర్శలు వస్తున్నాయి. వెబ్‌సైట్‌లో పొందుపర్చిన సీనియారిటీ, ఖాళీల వివరాలు గందరగోళంగా ఉండడంతో ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు. పదోన్నతులకు సంబంధించిన ఎస్‌ఏలు, పీజీహెచ్‌ఎంల సీనియారిటీ జాబితాలో అనర్హులను చేర్చడం గమనార్హం. క్రిమినల్ కేసులున్నవారికి ప్రాధాన్యత ఇవ్వడంపై టీచర్లు అవాక్కవుతున్నారు. గతంలో రూ. 2 కోట్లతో పరారైన కేసులో నిందితుడైన ఓ ఉపాధ్యాయుడి పేరును జాబితాలో మొదట్లోలో చేర్చారు. అలాగే మెరిట్ కం రోస్టర్ ప్రకారం జాబితాను తయారు చేయలేదు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, జనరల్, బీసీ కేటగిరీల వారీగా చూపించలేదు. ఖాళీల వివరాలను పోస్టుల కేటగిరి, సబ్జెక్టులు, మీడియంల వారీగా ఇవ్వాల్సి ఉండగా.. అంతా కలిసి లిస్టును తయారు చేశారు. కొందరు సీనియర్ల పేర్లు జాబితాలో చివరలో ఉండడం, మరి కొందరివి గల్లంతవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అభ్యంతరాలు తెలుపుతున్నారు.

బదిలీలకు సంబంధించి..

బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఇచ్చిన గడువు బుధవారంతో ముగియనుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు వాటి నకలును డీఈవో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

ఆగని పరపతి బదిలీలు..

జిల్లాలో ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా రెండు పరపతి బదిలీలు జరిగాయి. మరో నలుగురు ఉపాధ్యాయులు కూడా నిబంధనలకు విరుద్ధంగా పరపతితో బదిలీ అయినట్లు తెలిసింది. ఉపాధ్యాయ సంఘాల నేతలు పరపతితో బదిలీ చేయించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి నేడో రేపో బదిలీ ఉత్తర్వులు వచ్చే అవకాశాలున్నాయి. ఖాళీలు, సీనియారిటీ జాబితాలు ప్రకటించకముందే బదిలీలు జరుగుతున్నా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నోరు మెదపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

“ అభ్యంతరాలు స్వీకరిస్తాం

సీనియారిటీ, ఖాళీల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచాం. ఈ జాబితాకు సంబంధించి ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తాం. జాబితాలో తప్పులు ఉంటే సవరించి, మళ్లీ ప్రకటిస్తాం. షెడ్యూల్ ప్రకారం నిబంధనలకు లోబడి పారదర్శకంగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిర్వహిస్తాం.

– ఎస్.రాజు, డీఈవో, కామారెడ్డి

'ఎవరెస్టు శిఖరాన్నీ అధిరోహిస్తా'



మాట్లాడుతున్న బానోత్ వెన్నెల

కామారెడ్డి టౌన్: భవిష్యత్తులో ఎవరెస్టు శిఖరాన్ని కూడా అధిరోహిస్తానన్న నమ్మకం తనకుందని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన బానోత్ వెన్నెల పేర్కొంది. మాచారెడ్డి మండలం సోమారంపేటకు చెందిన బానోత్ వెన్నెల గతనెల 19న కిలిమంజారో పర్వతారోహణకు బయలుదేరి 26న శిఖరాన్ని చేరుకున్న విషయం తెలిసిందే. ఆమె మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌ స్‌లో మీడియాతో మాట్లాడింది. 2022 సంవత్సరంలోనే తనకు కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించే అవకాశం వచ్చిందని తెలిపింది. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో తాను పర్వతారోహణకు వెళ్లలేకపోయానని పేర్కొంది. ఈ ఏడాది మరోసారి అవకాశం వచ్చిందని, రాజ్యసభ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆర్థిక సాయం అందించడంతో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించగలిగానని తెలిపింది. పర్వతాన్ని ఎక్కే సమయంలో శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బంది అయ్యిందని, పట్టుదలతో ముందుకు సాగి లక్ష్యాన్ని చేరుకున్నానని వివరించింది. అతి చిన్న వయసులోనే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ తనకు స్ఫూర్తి అని, ఆమెలానే తానూ ఎవరెస్ట్‌ను అధిరోహిస్తానన్న నమ్మకాన్ని వ్యక్తం చేసింది. ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని కోరింది. సమావేశంలో బీజేపీ నాయకుడు ఎంజీ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

'వరిని కాండం తొలుచు పురుగు ఆశిస్తోంది'



కామారెడ్డిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

కామారెడ్డి రూరల్: జిల్లాలోని పలు ప్రాంతాలలో వరిని కాండం తొలుచు పురుగు ఆశించిందని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని పొలాలను ఆమె వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. వరిని ఆశించే పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కామారెడ్డి డివిజన్ వ్యవసాయ సంచాలకులు అపర్ణ, ఏవో శ్రీనివాస్, ఏఈవో అశోక్‌రెడ్డి, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రాఘురామిరెడ్డి, రాంగోపాలవర్మ, కిరణ్ బాబు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు నవీన్ కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాటు తుపాకులు అప్పగించాలి

సిరికొండ: గ్రామాల్లో, తండాల్లో ఎవరి వద్దనైన నాటు తుపాకులు ఉంటే పోలీసులకు స్వాధీనం చేయాలని ధర్పల్లి సీఐ సైదా కోరారు. మంగళవారం ఆయన సిరికొండ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. తుపాకులు స్వాధీనం చేసిన వారిపై ఎలాంటి కేసులు పెట్టమన్నారు. జంతువులను వేటాడటానికి నాటు తుపాకులను వినియోగిస్తున్నారని, అవి మిస్ యూజ్ అయితే వారి జీవితాలు కటకటాల పాలవుతాయని హెచ్చరించారు. నాటు తుపాకులతో దొరికితే జైలు పాలు కావాల్సి వస్తుందన్నారు. తమ తనిఖీల్లో దొరికినా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలకు డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ (రాజారాంనగర్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టి.మహేష్‌కుమార్ ఎంపికయ్యారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆయన పాల్గొంటారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ బుధవారం నుంచి ప్రారంభం అవుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పిల్లలు, పెద్దలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు బ్యాచ్‌లు ఉంటాయన్నారు. మహిళల బ్యాచ్ మార్చి 1 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. వివరాలకు స్విమ్మింగ్ కోచ్ మహిపాల్‌రెడ్డి 9966970010 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న ప్రతిభ కళాశాల (సీవోఈ)ల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు ఫిబ్రవరి 4 వరకు పొడిగించినట్లు సంస్థ నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ (డీసీవో) బి.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన ఎస్‌పీఎల్..

- పట్టుదలతో ఆడితే విజయం సొంతం : ఏసీపీ వెంకటేశ్వర్
- విజేతలకు బహుమతుల ప్రదానం



సీనియర్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన గౌతమి డిగ్రీ కళాశాల



సీనియర్ విభాగంలో విన్నర్‌గా ట్రోఫీ అందుకుంటున్న నిశిత డిగ్రీ కళాశాల జట్టు

నిజామాబాద్‌నాగారం: కృషి, పట్టుదలతో ఆడితే క్రీడల్లో విజయం సాధించవచ్చని నిజామాబాద్ నగర ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. ఈ నెల 27 నుంచి నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ మంగళవారం అట్టహాసంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఏసీపీ హాజరై మాట్లాడారు. సాక్షి క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా క్రికెట్ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత నచ్చిన క్రీడల్లో సాధన చేస్తు టోర్నీల్లో పాల్గొని సత్తా చాటాలని సూచించారు. అనంతరం విజేతలు, రన్నర్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ పల్లె మహేష్, బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి ప్రభాకర్, ఏడీవీటీ మేనేజర్ సంపత్, సర్క్యులేషన్ మేనేజర్ మల్లికార్జున్‌యాదవ్, మూడో టౌన్ ఎస్సై శ్రావణ్‌కుమార్, కోచ్ పారస్, స్కోరర్ యూనిస్, అంపైర్లు షారుక్, దుర్గాప్రసాద్, గ్రౌండ్‌మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు జరిగాయి ఇలా..

టోర్నీలో భాగంగా మంగళవారం మొదట సెమీ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. క్షత్రియ కాలేజీ, నిశిత డిగ్రీ కళాశాల మధ్య పోటీ జరిగిన సెమీస్‌లో నిశిత జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీస్‌లో గౌతమి డిగ్రీ కళాశాల, సాందీపని కళాశాల జట్లు తలపడ్డాయి. గౌతమి కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 83 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సాందీపని జట్టు నిర్ణీత ఓవర్లలో 82 పరుగులు చేసింది. హోరాహోరీగా జరిగిన పోరులో ఒక్క పరుగు తేడాతో గౌతమి కళాశాల జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది.



జూనియర్ విజేత పాలిటెక్నిక్ కళాశాల

జూనియర్ విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్ఆర్ కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మధ్య పోటీ జరిగింది. పాలిటెక్నిక్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్ కళాశాల 80 పరుగులే చేసింది.

సీనియర్ విజేత నిశిత కళాశాల

సీనియర్ ఫైనల్ నిశిత డిగ్రీ కళాశాల, గౌతమి కళాశాల మధ్య జరిగింది. టాస్ గెలిచి నిశిత జట్టు 10 ఓవర్లలో 100 పరుగులు చేసింది. ఇందులో వైభవ్ 60 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గౌతమి కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది.





ట్రోఫీ అందుకుంటున్న జూనియర్ విన్నర్ నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు, రన్నర్ ఎస్ఆర్ జూనియర్ కాలేజీ జట్టు

అభివృద్ధి పనులకు రూ.40 కోట్లు!

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో వివిధ శాఖల ద్వారా అభివృద్ధి పనుల కోసం రూ.40 కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నియోజక వర్గంలో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.70 కోట్లు మంజూరు చేశామని, దానికి తోడు అదనంగా మరో రూ.40 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రల్ లైటింగ్‌కు రూ.14 కోట్లు

మాచారెడ్డి మండలం గన్‌పూర్(ఎం) స్టేజీ వద్ద నుంచి మాచారెడ్డి హైస్కూల్ వరకు నాలుగు వరుసల రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.14 కోట్లు మంజూరు చేసినట్లు గంప గోవర్ధన్ వివరించారు. కామారెడ్డి మండల అడ్లూర్– రంగంపేట గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి రూ.3.25 కోట్లు, చిన్నమల్లారెడ్డి సమీపంలోని మొండివాగుపై వంతెన కోసం రూ.3.25 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

తండాలకు బీటీ రోడ్లు

తండాలకు కొత్తగా బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. మాచారెడ్డి మండలంలో గెండాతండాకు రూ.కోటి 25 లక్షలు, ఏదులగుట్ట తండాకు రూ.65 లక్షలు, మొగిలిగుట్ట తండాకు రూ.83 లక్షలు, మతంరాళ్ల తండాకు రూ.65 లక్షలు, గుంటి తండాకు రూ.కోటి 75 లక్షలు, బ్రాహ్మణపల్లి తండాకు రూ.కోటి 80 లక్షలు, దంతాపూర్ తండాకు రూ.65 లక్షలు, సోమారంపేట తండాకు రూ.90 లక్షలు, బోడగుట్ట తండాకు రూ.90 లక్షలు, రామారెడ్డి మండలం గొడుగుమర్రి తండాకు రూ.కోటి రెండు లక్షలు, మొండి వీరన్న తండాకు రూ.65 లక్షలు, సున్నపురాళ్ల తండాకు రూ.కోటి 50 లక్షలు, రమణతండా రోడ్డుకు రూ.90లక్షలు, వసురాంతండా–సేవ్యానాయక్ తండా రోడ్డుకు రూ.95 లక్షలు, కామారెడ్డి మండలం రాఘవపూర్ తండాకు రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు.

సబ్ సెంటర్ల నిర్మాణానికి రూ.కోటి 60 లక్షలు

నియోజక వర్గంలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో సబ్‌సెంటర్ల భవనాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.20 లక్షల చొప్పున 8 సబ్ సెంటర్లకు రూ. కోటి 60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అంబారీపేట, దోమకొండ, ముత్యంపేట, తిమ్మక్‌పల్లి, భవానీపేట, ఇసాయిపేట, ఎల్లంపేట, సింగరాయపల్లి గ్రామాల్లో సబ్‌సెంటర్లకు కొత్త భవనాలు నిర్మించనున్నట్లు వివరించారు.

కస్తూర్బాల్లో సౌకర్యాల కల్పనకు..

బీబీపేటలోని కస్తూర్బాకు రూ.2 కోట్ల 30లక్షలు, భిక్కనూరు కస్తూర్బాకు రూ.21 లక్షలు, రాజంపేట కస్తూర్బాకు రూ.39 లక్షలు మంజూరు చేసినట్లు గంప గోవర్ధన్ తెలిపారు. ఆయా పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

జాతీయ రహదారులపై ఠాణాల ఏర్పాటు

- సీపీ నాగరాజు

ఆర్మూర్: రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా జాతీయ రహదారులపై పోలీస్ స్టేషన్లు నిర్మిస్తున్నామని నిజామాబాద్ సీపీ నాగరాజు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు బాధితులను ఏవిధంగా కాపాడాలనే అంశంపై రోడ్ సేఫ్టీ విభాగం అధికారులు పట్టణంలోని సప్తగిరి ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడారు. 2022లో రోడ్డు ప్రమాదాల్లో జిల్లా వ్యాప్తంగా 320 మంది చనిపోయారని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ వాహనదారుల చిన్న నిర్లక్ష్యం కారణంగా ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్ సేఫ్టీ డీఎస్పీ చంద్రభాను, డాక్టర్ సుమన్, డాక్టర్ మధుసూదన్, ఎంవీఐ వెంకట్ స్వామి, ఆర్మూర్ పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ నాగరాజు

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్లు

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో వైద్యులు మూడు అరుదైన ఆపరేషన్లు విజయవంతంగా చేశారు. దీనికి సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ మంగళవారం తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నవీపేట్‌కు చెందిన సరస్వతి కడుపునొప్పితో ఆస్పత్రికి రాగా ఆమెను పరీక్షించిన వైద్యులు అండాశయంలో 30 సెంటిమీటర్ల కణతి ఉన్నట్లు గుర్తించారు. ఈ కణతి పెద్ద సైజ్‌లో ఉండటంతో మూత్రపిండాలపై ఒత్తిడి పడి ఆమె తీవ్రంగా ఇబ్బంది పడింది. ఈ ఆపరేషన్ కొరకు ఆమెను ఉస్మానియా లేదా, గాంధీ ఆసుపత్రికి పంపాలి కాని, ఇక్కడి ప్రయివేట్ ఆసుపత్రి వైద్యుడు యూరాలజిస్టు డాక్టర్ రాఘవేందర్‌ను సంప్రదించామన్నారు. ఆయన ముందుకు వచ్చి ఆపరేషన్‌ను చేశారని చెప్పారు. అలాగే నిర్మల్ జిల్లాకు చెందిన పోశానికి అదే విధమైన ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన ఆనంద్‌కు వెన్నుపూసలోని మూడు ఎముకలు విరిగి, మంచానికే పరిమితమయ్యాడు. డాక్టర్ నాగేశ్వర్ ఆధ్వర్యంలో వైద్య బృందం ఆనంద్‌కు ఆపరేషన్ చేయడంతో అతను ఇప్పుడు అందరిలాగే నడుస్తున్నాడని తెలిపారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

యూరియా కష్టాలు



సిరికొండ: మండలంలో యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తగినంత యూరియా సరఫరా లేకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని సొసైటీకి 900 బస్తాల యూరియా వచ్చింది. దీంతో సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు మంగళవారం ఉదయం నుంచే సొసైటీ వద్దకు తరలివచ్చారు. గంటల తరబడి బారులు తీరారు. ఏవో వెంకటేష్ టోకెన్లు ఇచ్చి యూరియాను పంపిణీ చేశారు.

'పవర్' లేని పంచాయతీ!

- బిచ్కుంద సర్పంచ్ చెక్ పవర్ రద్దు
- బిల్లులు రాక ఇబ్బందులు

బిచ్కుంద: బిచ్కుంద సర్పంచ్‌కు చెక్ పవర్ రద్దు కావడంతో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచ్ శ్రీరేఖ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని పంచాయతీ అధికారులు చెక్ పవర్ రద్దు చేశారు. చెక్ పవర్ లేక నెల రోజులు అవుతుంది. ప్రజా అవసరాల నిమిత్తం చేసిన అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు చెక్కు రూపంలో జీపీ ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసి ఇవ్వాల్సి ఉంటుంది. చెక్ పవర్ లేకపోవడంతో ఎక్కడి బిల్లులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం జీపీలో పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్ కలిసి 25 మంది ఉన్నారు. వీరికి జీతాలు చెల్లించాలేని పరిస్థితి నెలకొని ఉంది. జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి ఇతరులకు తాత్కాలికంగా చెక్ పవర్ కల్పించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బిచ్కుంద పంచాయతీ కార్యాలయం

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సాగర్ (ఫైల్)

సిరికొండ: మండలంలోని కుర్దుల్‌పేట్ గ్రామానికి వెళ్లే మార్గంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. న్యావనంది గ్రామానికి చెందిన కోనాయగారి సాగర్‌రెడ్డి(38) ఈ నెల 27న రాత్రి ఏడు గంటల సమయంలో సిరికొండ నుంచి న్యావనందికి బైక్‌పై బయలుదేరాడు. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనం సడన్‌గా మలపడంతో ఆ వాహనానికి తగిలి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు సాగర్ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బిచ్కుంద: బిచ్కుందలోని అన్నదమ్ముల చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చెరువులో మృతదేహం తేలిందని సమాచారం అందుకున్న ఎస్సై శ్రీధర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి 45 ఏళ్ల ఉంటాయని, ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదని ఆయన చెప్పారు.

క్రైం కార్నర్

పోలీసుల అదుపులో కిడ్నాప్ నిందితులు



కిడ్నాప్ వివరాలు తెలుపుతున్న సతీష్

సిరికొండ: యువకుడి కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు మల్లేష్‌తో పాటు మరో నిందితుడు శ్రావణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని గొల్ల గుర్జుకింది సతీష్‌ను సోమవారం కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. నిందితుల కోసం ధర్పల్లి సీఐ సైదా, సిరికొండ ఎస్సై నర్సింలు తమ సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి నుంచి గాలింపులు చేపట్టారు. మంగళవారం జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద పోలీసులు నిందితులను పట్టుకొని, సిరికొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చినట్లు సమాచారం. పోలీస్ స్టేషన్ వద్ద కిడ్నాప్‌కు గురైన యువకుడు సతీష్ విలేకరులతో మాట్లాడారు. కిడ్నాప్ చేసే సమయంలో సిరికొండ అడవుల్లో తనపై కర్రలతో దాడి చేశారని, భీంగల్‌లో వారి పొలం వద్ద దాడి చేశారని తెలిపాడు. అక్కడి నుంచి ధర్మపురి, కొండగట్టు తదితర ప్రాంతాల్లో కారులో తిప్పారని చెప్పాడు. కొండగట్టులో రాత్రి లాడ్జీలో ఉంచారని తెలిపాడు. మా అన్న విడాకుల పంచాయతీకి సంబంధించిన రూ.12 లక్షలను చెల్లిస్తే తనను వదిలేస్తామన్నారని పేర్కొన్నాడు. న్యావనందికి చెందిన ఇద్దరు, రావుట్లకు చెందిన ఇద్దరు తనను కిడ్నాప్ చేసే వ్యవహారంలో మల్లేష్‌కు సహకరించారని తెలిపాడు. వివరాల గురించి ధర్పల్లి సీఐ సైదాను సంప్రదించగా విచారణ కొనసాగుతున్నదని నిందితులను బుధవారం రిమాండ్ చేస్తామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగ చోరీ

పెర్కిట్: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో సోమవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి తీగను దొంగిలించారు. దేగాం గ్రామం నుంచి మిర్దాపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో వాగు సమీపంలో గల వ్యవసాయ క్షేత్రాల పక్కన ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్లను దొంగలు ధ్వంసం చేసి రాగి తీగను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై గ్రామస్తులు ట్రాన్స్‌కో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డి: మహిళను చంపుతామని బెదిరించిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై గణేష్ మంగళవారం తెలిపారు. వివరాలు.. మండలంలోని ఆజామాబాద్ గ్రామానికి చెందిన చంద్రకళ భర్త పర్వాగౌడ్‌ను గ్రామానికి చెందిన కొందరు హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి రాజీ విషయంలో చంద్రకళ బావ రామాగౌడ్, అతడి కుమారుడు సతీష్‌గౌడ్ రాజీ అయ్యారు. కానీ చంద్రకళ రాజీకి ఒప్పుకోకపోవడంతో రామాగౌడ్, సతీష్‌గౌడ్ గత నెల27న ఆమెను గొడ్డలితో నరికి చంపుతామని బెదిరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ గ్రామానికి చెందిన కోట్ల బాగన్న (48) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేష్ మంగళవారం తెలిపారు. వివరాలు.. సుమారు మూడు నెలల క్రితం బాగన్నతో అతడి భార్య గొడవ పెట్టుకుని ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన బాగన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా..

- ఊపిరాడక అడ్డా కూలీ మృతి
- న్యాయం చేయాలని ఠాణా ఎదుట మృతుడి కుటుంబ సభ్యుల ధర్నా

ఖలీల్‌వాడి: సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి వెళ్లిన అడ్డా కూలీ ఊపిరాడక మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జరగ్గా.. మొదట పోలీసులు ఫిట్స్‌తో చనిపోయినట్లు భావించారు. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాలు.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన హరిప్రసాద్(32) అడ్డా కూలీ. హబీబ్‌నగర్ కాలనీకి చెందిన హస్మత్ అలీ తన ఇంట్లో సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలని సోమవారం తీసుకెళ్లాడు. అక్కడ పనిచేస్తూ హరిప్రసాద్ ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి ఓనర్ హస్మత్‌అలీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. హరిప్రసాద్ మృతికి కారణమైన ఇంటి యజమానిని అరెస్టు చేసి, తమకు న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు సీపీఐ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. కనీస ప్రమాణాలు పాటించకుండా సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయించడంతోనే హరిప్రసాద్ చనిపోయాడని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల గోవర్దన్, ద్యారంగుల కృష్ణ, బిజిగం సుజాత, మృతుడి తల్లి లక్ష్మి, సోదరుడు విక్రమ్ ఉన్నారు. కాగా ఈ కేసును తారుమారు చేయడానికి ఓ ప్రజాప్రతినిధి ప్రయత్నించినట్లు తెలిసింది.



హరిప్రసాద్ మృతదేహం



ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఆస్తి కోసం భర్త హత్య

- నిందితురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు

బాన్సువాడ టౌన్: ఆస్తి కోసం కట్టుకున్న భర్తను రోకలి బండతో కొట్టి హత్య చేసిన భార్యను మంగళవారం బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో అరెస్ట్ చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. తాడ్కోల్ గ్రామానికి చెందిన తుమ్మల వెంకట్‌రెడ్డి (55) గత నెల 23న ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల విచారణలో వెంకట్‌రెడ్డిని తన భార్య తుమ్మల రుక్మిణి హత్య చేసినట్లు తేలింది. వెంకట్‌రెడ్డి తాగుడుకు బానిసై నిత్యం ఆస్తి విషయంలో భార్యతో గొడవ పడేవాడు. తన ఆస్తిని ఆడపడుచులకు రాసి ఇస్తానని భార్యతో చెప్పేవాడు. ఈ క్రమంలో గత నెల 23న మద్యం తాగి ఇంటికి వచ్చిన వెంకట్‌రెడ్డి ఆస్తి విషయమై రుక్మిణితో గొడవ పడగా ఆమె రోకలి బండతో వెంకట్‌రెడ్డి మెడపై గట్టిగా కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం చున్నీతో రక్తం తుడిచేసిన నిందితురాలు ప్రమాదవశాత్తు పడి చనిపోయాడని అందరిని నమ్మించింది. హత్యకు ఉపయోగించిన రోకలి బండను స్వాధీనం చేసుకుని, నిందితురాలిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరించారు. ఈ సమావేశంలో ఎస్సై రవీందర్, క్రైం స్టాఫ్ ఓంకార్, కానిస్టేబుల్ గంగాధర్ తదితరులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి: హత్య కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నగరంలోని అసద్ బాబానగర్‌లోని రాజీవ్‌గృహకల్ప బ్లాక్ నెంబర్ 21 ఎఫ్‌లో లెట్రీన్ పైప్ రిపేర్ విషయంలో అహ్మద్‌ఖాన్‌కు, చాంద్ పాషా, షేక్‌అత్తర్‌కు మధ్య గొడవ జరిగింది. దీంతో అత్తర్ కత్తిని పాషాకు అందివ్వగా చాంద్ పాషా కత్తితో అహ్మద్ ఖాన్‌కు పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ అహ్మద్‌ఖాన్ మృతి చెందాడు. మంగళవారం నిందితులను ధర్మపురి హిల్స్ వద్ద పట్టుకుని కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ తెలిపారు. సౌత్ రూరల్ సీఐ జగడం నరేశ్, ఆరో టౌన్ ఎస్సై సాయి కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్

కుక్కల దాడిలో జీవాలు మృత్యువాత



బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో లింగాయపల్లి పర్శరాంలుకు చెందిన 12 జీవాలు మంగళవారం కుక్కల దాడిలో మృత్యువాత పడ్డాయి. మరో ఎనిమిది గాయపడ్డాయి. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ బాధితుడిని పరామర్శించారు. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న చెరుకు లారీ



రాజంపేట: రాజంపేటలో విద్యుత్ స్తంభాన్ని చెరుకు లారీ ఢీకొట్టింది. మండలంలోని కొండాపూర్ నుంచి వస్తున్న చెరుకు లారీ అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొంది. లారీ డ్రైవర్ మద్యం తాగి నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.